
# ఏమి అభివృద్ధి!



న్యూ ఢిల్లీ రైల్వేస్టేషన్‌కి ఒక సర్దార్జీ చేతిలో బ్రీఫ్‌కేస్ పుచ్చుకొని ఆదరాబాదరాగా వచ్చాడు.

ఆయన బొంబాయి వెళ్లాలి. బొంబాయి వెళ్లే రైలు ఎడం పక్క ప్లాట్ ఫాం మీద ఉంది. ఈ విషయాన్ని ఆయన బాగా గుర్తు ఉంచుకున్నాడు.

ఇంక రైలు కదలడానికి చాలానే టైముంది. అందువల్ల టీ తాగి రావాలని బుద్ధి పుట్టింది సర్దార్జీకి.

టీ స్టాల్‌కి వెళ్లి టీ తాగి వెనకకి మరలాడు.

వెనక్కి తిరగడంతో దిశ మారిపోయిన విషయం మరిచిపోయి, అప్పుడు తనకి ఎడమ వైపున ఉన్న రైల్లోకి ఎక్కేశాడు.

అది కలకత్తా పోయే రైలు. ఈ రెండు రైళ్లూ ఎదురుబదురుగా ఉన్నాయి.

కలకత్తా వెళ్లే రైల్లో సీట్లు ఖాళీ లేవు. అందువల్ల బెర్త్ మీద ఎక్కి నడుం వాల్చాడు సర్దార్జీ.

రైలు మంచి జోరుగా పోతోంది.

బెర్త్ మీద పడుకుని ఉన్న సర్దార్జీ తలదించి చూస్తే- కింద సీట్లో మరో సర్దార్జీ కనిపించాడు. ఇద్దరు సర్దార్జీలకు మాటలు కలిశాయి.

"మీ రెక్కడికి పోతున్నారు?".

"కలకత్తా. మరి, మీరెక్కడికి పోతున్నారు?"

"బొంబాయికి!"

"ప్రస్తుతం మన రైల్వే మంత్రి సర్దార్ స్వరణ్ సింగ్! ఈయన రైల్వే మంత్రి అయ్యాక రూటు సర్వీసులు ఎంత అభివృద్ధి చెందాయో చూశారా? మన సర్దార్జీలే అంత!"

"ఏమి అభివృద్ధి జరిగింది??"

"ఇంకా ఏమి కావాలి? నేను కలకత్తాకి, మీరు బొంబాయికి వెళ్తున్నాం. ఒకే రైల్లో ప్రయాణం చేస్తూ కింద సీట్లోని వాడు కలకత్తాకి, పైన బెర్త్‌లోనివాడు బొంబాయికి వెళ్లగలిగేటట్టు చేశాడంటే, సర్దార్ స్వరణ్ సింగ్ గొప్పతనం గురించి వేరే చెప్పాలా!" అని ఆశ్చర్యపోయాడు కింద ఉన్న రెండో సర్దార్జీ.

*- ఈవారం వార పత్రిక... 9 ఫిబ్రవరి '84*



## అసలు సంగతి

పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగేటట్లు విస్కీ తాగేటప్పుడు కళ్లు మూసుకుని తాగడం సుబ్బారాయుడికి అలవాటు. ఒకసారి ప్రక్కనున్న మిత్రుడు- "నీకిదేం రోగం?" అని అడిగాడు.

"ఏం లేదు. విస్కీ చూడగానే నాకు నోరూరుతుంది. నోరు లాలాజలంతో నిండిపోతుంది. దానిమూలంగా విస్కీ పల్చబడడం నాకిష్టం లేదు" అని రహస్యం బయటపెట్టాడు సుబ్బారాయుడు.